# ఆన్‌లైన్ గేమ్స్ నిషేధ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**
ఆన్‌లైన్ గేమ్స్‌ని నిషేధిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టరూపంలోకి వచ్చింది. ఆన్‌లైన్ మనీ గేమింగ్ యాప్‌లన్నిటినీ ఈ చట్టం నిషేధించింది. ఈ మనీ గేమింగ్‌లను ప్రమోట్ చేసిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 1 కోటి వరకు జరిమానా విధించడానికి చట్టం అవకాశం కల్పిస్తోంది.అటువంటి ప్లాట్‌ఫారాల తరఫున ప్రచారం చేసిన వారికి సైతం 2 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు, 2025ని రాజ్యసభ గురువారం 26 నిమిషాల్లో ఆమోదించగా అంతకుముందు రోజు లోక్‌సభ కేవలం 7 నిమిషాలలో ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించింది.

# భర్త నిరుద్యోగాన్ని ఎగతాళి చేయడం క్రూరత్వమే


**విడాకులు మంజూరు చేసిన ఛత్తీస్‌గఢ్ హైకోర్టు**




**బిలాస్‌పూర్ ప్రజా స్వేచ్ఛ**
భర్త నిరుద్యోగిగా ఉండటాన్ని భార్య ఎత్తిపొడవటం, ఎగతాళి చేయడం, ఆర్థిక కష్టాల్లో ఉన్నపుడు అసమంజసమైన కోరికలు కోరడం మానసిక క్రూరత్వమేనని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తెలిపింది. ఈ కారణాల రీత్యా భర్తకు విడాకులు మంజూరు చేసింది. ఆయనకు విడాకులు మంజూరు చేసేందుకు తిరస్కరించిన కుటుంబ న్యాయస్థానం తీర్పును రద్దు చేసింది.భార్య పీహెచ్‌డీ పట్టా పొందిన తర్వాత, స్కూలు ప్రిన్సిపాల్‌గా అధిక వేతనం గల ఉద్యోగాన్ని పొందిన అనంతరం, తన భర్త పట్ల ఆమె ప్రవర్తన మారిపోయినట్లు రుజువైందని హైకోర్టు తెలిపింది. ఆయన పట్ల ఆమెకు గౌరవం లేకుండా పోయిందని, కొవిడ్-19 మహమ్మారి సమయంలో నిరుద్యోగిగా ఉన్నందుకు ఆయనను తరచూ ఎగతాళి చేస్తూ ఉండేదని పేర్కొంది. అల్పమైన విషయాలపై సైతం తరచూ జగడాలకు దిగుతుండేదని పేర్కొంది. ఇటువంటి చర్యలు చట్టప్రకారం మానసిక క్రూరత్వమేనని స్పష్టం చేసింది.

# ఉప రాష్ట్రపతి బరిలో ఆ ఇద్దరే..

**మిగిలిన 44 మంది దరఖాస్తుల తిరస్కరణ**



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**
వచ్చే నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన పూర్తయ్యింది. 46 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, ఇద్దరు తప్ప మిగతా వారి దరఖాస్తులను రిటర్నింగ్ అధికారి తిరస్కరించినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు.వారంతా మొత్తం 68 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన తర్వాత ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్ష కూటమి అభ్యర్థి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి మాత్రమే రంగంలో మిగిలారు. వీరిద్దరూ తలో నాలుగు సెట్ల నామినేషన్ పేపర్లు దాఖలు చేయగా, అన్నీ సక్రమంగా ఉండటంతో అధికారులు ఆమోదించారు.


# భారతీయ అంతరిక్ష కేంద్రం నమూనా ఆవిష్కరణ

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శుక్రవారం భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్) మాడ్యూల్‌ను ఆవిష్కరించింది. ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ రోదసీ దినోత్సవాల్లో దీనిని ప్రదర్శించింది. మన దేశంలోనే తయారు చేసిన అంతరిక్ష స్టేషన్ బీఏఎస్ మొదటి మాడ్యూల్‌ను 2028నాటికి ప్రారంభించేందుకు భారత దేశం ప్రయత్నిస్తున్నది.2035 నాటికి ఐదు బీఏఎస్ మాడ్యూల్స్‌ను అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నది. భూమి ఉపరితలం నుంచి 450 కి.మీ. ఎత్తులో భూ దిగువ కక్ష్యలో దీనిని ఉంచుతారు. ప్రస్తుతం ఉన్న ఆర్బిటాల్ ల్యాబొరేటరీలు ఏమిటంటే, ఐదు అంతరిక్ష సంస్థలు నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్, చైనాకు చెందిన తియాంగాంగ్ స్పేస్ స్టేషన్.

# మళ్లీ భారత్‌లోకి టిక్ టాక్.

**అందుబాటులోకి చైనా కంపెనీ వెబ్‌సైట్**

న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ
భారతీయ, చైనా సైనిక బలగాల మధ్య గల్వాన్ ఘర్షణ తర్వాత భద్రతా కారణాలు చూపుతూ భారత ప్రభుత్వం 2020లో నిషేధించిన చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ యాప్ టిక్ టాక్ ఐదేళ్ల తర్వాత మళ్లీ భారత్‌లోకి ప్రవేశించే అవకాశం కనపడుతోంది. టిక్ టాక్‌తోపాటు వందలాది చైనీస్ గేమింగ్ యాప్‌లను భారత ప్రభుత్వం నిషేధించింది. ఆ తర్వాత కూడా భారత్‌లో ఏదోవిధంగా కొనసాగేందుకు శాయశక్తులా ప్రయత్నించిన టిక్ టాక్ కంపెనీ ఎట్టకేలకు 2023 ఫిబ్రవరి 28న మూతపడింది. అప్పటి నుంచి భారత్‌లో అందుబాటులో లేని టిక్ టాక్ వెబ్‌సైట్ హఠాత్తుగా మళ్లీ జీవం పోసుకుంది. త్వరలోనే దేశంలో షార్ట్ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్‌ని కంపెనీ తిరిగి ప్రారంభించనున్నట్లు సూచనలు అందుతున్నాయి.





ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్ అలీఎక్స్‌ప్రెస్, విమెన్ క్లోతింగ్ ఈకామర్స్ ప్లాట్‌ఫామ్ షీన్ కూడా రీఎంట్రీ ఇవ్వనున్నట్టు తెలుస్తున్నది.ఈ కంపెనీల వెబ్‌సైట్లు భారత్‌లో తిరిగి ప్రారంభమయ్యాయి. చైనా విదేశాంగ మంత్రి భారత్‌ను సందర్శించి వెళ్లిన కొన్ని రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. భారతీయ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించినప్పటి నుంచి భారత్, చైనా మధ్య సంబంధాలలో పురోగతి కనిపిస్తోంది. భారత్‌కు ఎరువులు, అరుదైన ఖనిజాలు, సొరంగాలను తవ్వే మిషన్ల ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు చైనా గురువారం ప్రకటించింది. టియాంజిన్‌లో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగే షాంఘై సహకార సంస్థల(ఎస్‌సీఓ) సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. కాగా, టిక్ టాక్‌ను తిరిగి దేశంలో అనుమతించే విషయమై అధికారికంగా ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు.

# వాట్సాప్‌కు ప్రత్యామ్నాయంగా మాక్స్ యాప్..

**కొత్తగా ప్రవేశపెట్టిన రష్యా**

న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ
: ప్రపంచవ్యాప్తంగా ఉపయోగించే కొన్ని యాప్స్‌ను చైనా నిషేధించిన సంగతి తెలిసిందే. అదేవిధంగా వాట్సప్ వినియోగంపై చైనాలో నిషేధముంది. అక్కడ వాట్సాప్‌కు బదులుగా 'వి చాట్' లాంటి ప్రత్యామ్నాయ యాప్స్‌ను అందుబాటులో ఉంచింది. ఇప్పుడు చైనా బాటలోనే రష్యా నడుస్తోంది. అయితే రష్యాలో వాట్సప్‌ను నిషేధించలేదుగానీ దానికి ప్రత్యామ్నాయంగా 'మాక్స్ ' పేరుతో ఓ కొత్త మయాప్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పుడు దాన్ని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది.విదేశీ డిజిటల్ సర్వీసులపై ఆధారపడకుండా సొంత డిజిటల్ సేవలను అందుబాటులోకి తేవడం, వాటిని బలోపేతం



చేయడంపై రష్యా ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే వాట్సప్ బదులుగా మ్యాక్స్ యాప్ వినియోగాన్ని పెంచాలని నిర్ణయించింది. ఇకపై దేశంలో తయారు చేసే ప్రతి మొబైల్ ఫోన్, ట్యాబ్లెట్‌లో 'మ్యాక్స్'ను ప్రీ-ఇన్‌స్టాల్ యాప్‌గా ఉంచాలని రష్యా ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే పలు యాప్స్ ప్రీ-ఇన్‌స్టాల్‌గా వస్తున్నాయి. వాటిలో 'మ్యాక్స్'ను చేర్చాలని సూచించింది. ఆ యాప్‌లో ప్రభుత్వ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని అధికారులు అంటున్నారు.ఈ మాక్స్ యాప్‌ను ప్రభుత్వరంగ సంస్థ వీకే రూపొందించిందని, అందువల్ల యూజర్ల డేటాపై ప్రభుత్వం నిఘా పెట్టే అవకాశాలున్నాయని విమర్శలు వస్తున్నాయి. వాటిని అక్కడి ప్రభుత్వం ఖండించింది. వాట్సప్, టెలిగ్రామ్ కన్నా 'మ్యాక్స్'కు పరిమిత యాక్సెస్ ఉంటుందని, నిఘా పెట్టే అవకాశం లేదని స్పష్టంచేసింది. ఈ యాప్‌తోపాటు సెప్టెంబర్ ఒకటి నుంచి రష్యాలో తయారయ్యే యాపిల్ ఫోన్లలో దేశీయ యాప్‌స్టోర్ అయిన 'రూ స్టోర్'ను కూడా ప్రీ-ఇన్‌స్టాల్ యాప్ జాబితాలో చేర్చాలని ఆదేశించింది. వచ్చే ఏడాది ప్రారంభం నుంచి 'లైమ్ హెచ్‌డీ టీవీ' యాప్‌ను కొత్త టీవీల్లో కచ్చితంగా ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని పేర్కొంది. దాని ద్వారా ప్రభుత్వ టీవీ ఛానళ్లను ఉచితంగా ప్రసారం చేసే అవకాశం ఉంది.

# నక్సల్స్‌కు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మద్దతు

**విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థిపై అమిత్‌షా ఆరోపణ**



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**
విపక్షాల తరఫున ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేస్తున్న జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి కారణంగా దేశంలో నక్సలిజం బలపడిందని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా ఆరోపించారు. సల్వాజుడుం కేసులో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పు ఇవ్వకపోయి ఉంటే 2020 కన్నా ముందుగానే దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతమొందించి ఉండేవారమని పేర్కొన్నారు. మలయాళం పత్రిక మనోరమ న్యూస్ కాన్‌క్లేవ్‌ను ప్రారంభించిన సందర్భంగా అమిత్‌షా మాట్లాడారు. ఉప రాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసుకోవడంతోనే కేరళలో కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలు మరింత దిగజారాయని అన్నారు. 'సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి నక్సలిజానికి సాయం చేశారు.ఆయన సల్వా జుడుం తీర్పునిచ్చారు. సల్వా జుడుం తీర్పు ఇవ్వకపోయి ఉంటే నక్సల్స్ ఉగ్రవాదం 2020నాటికే అంతమై ఉండేది. నక్సల్స్ సిద్ధాంతాలతో స్ఫూర్తి పొందినందునే ఆయన సల్వాజుడుం తీర్పునిచ్చారు' అని అమిత్‌షా వ్యాఖ్యానించారు. మావోయిస్టులపై పోరాటంలో భాగంగా గిరిజన యువతను కోయ కమాండోలు, సల్వా జుడుం పేరిట ప్రత్యేక పోలీసు అధికారులుగా నియమించడాన్ని సుప్రీంకోర్టు 2011లో రద్దు చేసింది. ఇది చట్టవ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధం అని నాడు సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్న సుదర్శన్‌రెడ్డి తీర్పు చెప్పారు. వామపక్షాల ఒత్తిడితోనే కాంగ్రెస్ పార్టీ నక్సలిజాన్ని ప్రోత్సహించే వ్యక్తిని తమ అభ్యర్థిగా నిలబెట్టిందని షా ఆరోపించారు.

# మా షరతులకు ఒప్పుకోకపోతే నరక ద్వారాలు తెరుచుకుంటాయ్

**హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక**



**టెల్ అవీవ్, ప్రజా స్వేచ్ఛ**
హమాస్ కనుక తమ షరతులకు అంగీకరించకపోతే వారికి నరకం తప్పదని, గాజా.. మరో రఫా, బీట్ హనౌన్‌గా మారుతుందని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ శుక్రవారం హెచ్చరించారు. గాజాని స్వాధీనం చేసుకోవడానికి సైన్యానికి అధికారిక అనుమతి ఇస్తానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటన చేయడంతో..ముట్టడించిన గాజా నగరంపై ఇజ్రాయెల్ మిలిటరీ దళాలు భారీ సైనిక దాడికి సిద్ధమవుతున్న క్రమంలో ఆయనీ హెచ్చరిక చేశారు. హమాస్ ఆయుధాలు విడిచిపెట్టకపోతే గాజాను నాశనం చేస్తామని హెచ్చరిస్తూ.. హమాస్ తమ దారికి రాకపోతే గాజా విధ్వంసం తప్పదని, వారికి నరక దారులు తెరుచుకుంటాయని స్పష్టంచేశారు.

# పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌కు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చురకలు.. ఏమన్నారంటే..!



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**
: పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ పై భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చురకలేశారు. భారత్‌ను ఫెరారీతో, పాక్‌ను చెత్తబండితో పోల్చిన మునీర్ వ్యాఖ్యలను రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. ఇది పాక్ ఫెయిలైందని మునీర్ ఒప్పుకోవడమేనన్నారు.'రెండు దేశాలకు ఒకే సమయంలో స్వాతంత్ర్యం వచ్చింది. ఒక దేశం కష్టపడి బలమైన విధానాలు, ముందుచూపుతో ఫెరారీ లాంటి ఆర్థిక వ్యవస్థను నిర్మించుకుంది. మరో దేశం మాత్రం ఏ విధానాలూ లేకుండా చెత్తబండిలా మిగిలింది. అంటే అది కచ్చితంగా ఆ దేశం వైఫల్యమే. ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలు ఈ తప్పును ఒప్పుకుంటూ చేసినవే' అని సింగ్ అన్నారు. కొన్ని రోజుల క్రితం యూఎస్‌లోని ఫ్లోరిడాలో పాకిస్తానీయులతో మునీర్ మాట్లాడారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను రాళ్లతో నిండిన చెత్తబండిగా పోల్చారు. 'భారత్ ఫెరారీ లాంటిది. దాన్ని మన చెత్తబండి గుద్దితే ఎవరికి నష్టం..?' అని మునీర్ ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై నెట్టింట తెగ ట్రోలింగ్ జరిగింది.

# 20 ఏండ్లు పైబడిన వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యువల్ ఫీజు పెంపు



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**
దేశంలో 20 ఏండ్లు పైబడిన వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యువల్ ఫీజును పెంచుతున్నట్టు కేంద్ర రవాణా శాఖ శుక్రవారం ప్రకటించింది. 20 ఏండ్లు పైబడిన వాహనాలు వినియోగించకుండా ప్రజల్ని నిరుత్సాహపర్చడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది.20 ఏండ్లు దాటిన లైట్ మోటార్ వెహికల్స్ (ఎల్ఎంవీ) రెన్యువల్ ఫీజును రూ.5 వేల నుంచి 10 వేలకు, 20 ఏండ్ల పైబడిన మోటారు సైకిళ్ల రెన్యువల్ ఫీజును రూ.వెయ్యి నుంచి 2 వేలకు, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు రూ.3,500 నుంచి 5 వేలకు పెంచుతున్నట్టు వివరించింది.

